ANDHRAJYOTHY
ఆంధ్రజ్యోతి

5 సిద్దిపేట
సోమవారం 19 ఫిబ్రవరి 2024



దూళిమిట్ట మండలం కూటిగల్‌లోని గద్దెల వద్ద ఏర్పాటు చేసిన చలువ పందిళ్లు


హుస్నాబాద్ పట్టణంలోని అమ్మవార్ల గద్దెలు

జాతరెళ్లిపోదామా

రెండేళ్లకోసారి సమక్క, సారలమ్మ జాతరలకు తరలివెళ్లడం జిల్లా ప్రజలు ఒక సెంటిమెంట్‌గా భావిస్తుంటారు. తల్లులను పూజించి నిలువెత్తు బంగారం (బెల్లం) సమర్పిస్తే తమ కోర్కెలు నెరవేరుతాయని నమ్మకం. చాలా మంది మేడారం మహాజాతరకు బయల్దేరితే మిగితావారు స్థానికంగా ఉన్న మినీ జాతరల్లో మొక్కులు చెల్లించుకుంటారు. ఈ నెల 21 నుంచి 24 వరకు అమ్మవార్లు గద్దెలపై కొలువు దీరనున్నారు. ములుగు జిల్లా మేడారంలో అమ్మవార్లు ఆశీనులైన క్షణాల్లోనే మన జిల్లాలోని జాతరలకు ఆధ్యాత్మిక శోభ సంతరించుకుంటుంది. గద్దెల వద్ద భక్తులు సిగమూగుతూ అమ్మవార్లను స్మరించుకుంటారు.

- ఆంధ్రజ్యోతి ప్రతినిధి, సిద్దిపేట, ఫిబ్రవరి 18


అక్కన్నపేట మండలం గోవర్ధనగిరిలోని సంజీవరాయగుట్టపై సమ్మక్క, సారలమ్మ గద్దెలు

- సమీపిస్తున్న మేడారం మహాజాతర
- ఈ నెల 21 నుంచి 24 వరకు నిర్వహణ
- సిద్దిపేట జిల్లాలోనూ సమ్మక్క సారక్క జాతరలు
- 12 గ్రామాల్లో మినీ మేడారాలు ముస్తాబు
- 5 లక్షల మందికి పైగా దర్శించుకునే అవకాశం

సిద్దిపేట జిల్లాలోని పలుచోట్ల ఉన్న సమ్మక్క, సారలమ్మ జాతరలను ఘనంగా నిర్వహించడానికి ఏర్పాట్లు చేస్తున్నారు. రెండేళ్ల పాటు భక్తుల రాకపోకలకు, మొక్కులకు, పూజలకు దూరంగా ఉన్న అమ్మవార్ల గద్దెలను ముస్తాబు చేస్తున్నారు. లైటింగ్ వసతులు కల్పిస్తున్నారు. వచ్చిపోయే భక్తులకు ఇబ్బందులు తలెత్తకుండా పార్కింగ్ సౌకర్యాన్ని గద్దెలకు దూరంగా ఏర్పాటు చేస్తున్నారు. నాలుగు రోజుల పాటు వ్యాపారాలు నిర్వహించడానికి ఆసక్తి కలిగిన వారి నుంచి టెండర్లను ఆహ్వానిస్తున్నారు. కొబ్బరికాయలు, కోళ్లు, బెల్లం దుకాణాలు, ఆటవస్తువుల దుకాణాలను ఏర్పాటు చేసేందుకు వేలం పాటలు నిర్వహించనున్నారు. ఇక జాతర్లపై పర్యవేక్షణ కనబర్చడానికి ఆయా గ్రామాలకు చెందిన వారితో ఉత్సవ కమిటీల కోసం అధికార పార్టీ నేతలు కసరత్తు ప్రారంభించారు. ఎలాంటి అవాంఛనీయ సంఘటనలూ తలెత్తకుండా ఉండేందుకు పోలీస్ యంత్రాంగం సైతం ప్రత్యేక దృష్టిసారించింది.

మహాజాతరకు మొదలైన రాకపోకలు..

ములుగు జిల్లాలో ఉన్న మేడారం మహాజాతరలో సమ్మక్క, సారలమ్మల గద్దెలను స్పృశించడానికి ఇప్పటికే భక్తులు పెద్దసంఖ్యలో రాకపోకలు సాగిస్తున్నారు. ఆర్టీసీ బస్సులు, ప్రత్యేక వాహనాల ద్వారా వెళ్తున్నారు. చిలకలగుట్ట నుంచి వచ్చి గద్దెలపై కొలువుదీరే తల్లుల కృపకు పాత్రులవ్వాలనే కోరికతో ఎన్ని ఇబ్బందులైనా అక్కడికి వెళ్లేందుకు సిద్ధమవుతున్నారు. కోరికలు నెరవేరడానికి కొందరు, నెరవేరినందుకు మరికొందరు నిలువెత్తు బంగారం(బెల్లం)తో మొక్కులు సమర్పిస్తున్నారు. గొర్రెలు, మేకలు, కోళ్లతో మొక్కు తీర్చుకుంటున్నారు. కుటుంబాలవారీగా, గ్రామాలవారీగా జాతరకు బైలెల్లుతున్న పరిస్థితి జిల్లాలో కనిపిస్తున్నది. ఇప్పుడే ఇలా ఉంటే ఇక కీలకమైన నాలుగు రోజుల్లో ఈ సంఖ్య పదింతలు పెరగక తప్పదు.


గోవర్ధనగిరిలో సమ్మక్క, సారక్క జాతర ముఖద్వారం

జిల్లా నుంచి ప్రత్యేక బస్సులు

జిల్లాలోని హుస్నాబాద్, సిద్దిపేట, గజ్వేల్, దుబ్బాక డిపోల నుంచి దాదాపు 120 బస్సుల ద్వారా మేడారం మహాజాతరకు భక్తులను తరలించేందుకు ఆర్టీసీ సిద్ధమైంది. హనుమకొండ కేంద్రంగా మేడారం జాతరకు ప్రత్యేక బస్సులు రాకపోకలు సాగిస్తుంటాయి. అయితే జిల్లా నుంచి బస్సులను హనుమకొండకే తరలించనున్నారు. అదే విధంగా కొన్ని బస్సులను మేడారం స్పెషల్ పేరిట సిద్దిపేట, గజ్వేల్, దుబ్బాక, హుస్నాబాద్, చేర్యాల నుండి కూడా నడపడానికి కసరత్తు చేస్తున్నారు. జిల్లాలోని ప్రయాణికులకు ఇబ్బందులు తలెత్తకుండా చూడడంతోపాటు మేడారం భక్తులకు సమస్యలు రాకుండా ప్రణాళిక తయారుచేసుకున్నారు. ఈనెల 21 నుంచి నాలుగు రోజుల పాటు ఇతర రూట్లలో ఆర్టీసీ సేవలు మితంగానే ఉండనున్నాయి.


చిన్నకోడూరు మండలం కిష్టాపూర్‌లో ముస్తాబైన అమ్మవార్ల గద్దెలు

12 గ్రామాల్లో అమ్మవార్ల జాతర


కోహెడ మండలం పరివేదలో ముస్తాబవుతున్న గద్దెలు

- హుస్నాబాద్ ఎల్లమ్మ ఆలయం సమీపంలో ఉన్న గద్దెలపై సమ్మక్క, సారలమ్మలను వీక్షించేందుకు సుమారు లక్ష మంది భక్తులు తరలి వస్తారు.
- బెజ్జంకి మండలం దేవక్కపల్లి, తోటపల్లి, గుండారం గ్రామాల్లో జరిగే జాతరలకు దాదాపు లక్ష మందికి పైగానే భక్తులు వస్తుంటారు. దేవక్కపల్లి జాతర భక్తులతో కిక్కిరిసిపోతుంది.
- కోహెడ మండలం తంగళ్లపల్లి, పరివేద, వింజపల్లి గ్రామాల్లోని గద్దెలపై తల్లులకు మొక్కులు సమర్పించేందుకు దాదాపు 1.50 లక్షల పైచిలుకు భక్తులు వస్తారు.
- రాజీవ్ రహదారి పక్కన ఉన్న కొమురవెల్లి కమాన్ వద్ద కూడా అమ్మవార్ల గద్దెలున్నాయి. ఇక్కడికీ పెద్ద సంఖ్యలోనే భక్తులు తరలివస్తారు. సిద్దిపేటకు చెందిన భక్తులు భారీగా హాజరవుతారు.
- ధూలిమిట్ట మండలం కూటిగల్‌లో సమ్మక్క, సారలమ్మ జాతరకు 30వేల మందికి పైగానే భక్తులు వస్తారు. చలువ పందిళ్లు, నీటి వసతి, మరుగుదొడ్ల సౌకర్యాలు చేస్తున్నారు.
- అక్కన్నపేట మండలం గోవర్ధనగిరిలోని సంజీవరాయగుట్ట పైన వెలసిన జాతరకు 50వేల మందికి పైగానే భక్తులు వస్తారని అంచనా.
- చిన్నకోడూరు మండలం కిష్టాపూర్‌లోని అమ్మవార్ల గద్దెలను దర్శించుకోవడానికి 10వేల మంది వరకు భక్తులు వస్తారు.
- హుస్నాబాద్ మండలం పొట్లపల్లిలోని ఎల్లమ్మ గుట్ట వద్ద సమ్మక్క, సారక్క జాతర సాగుతుంది. ఈ జాతరకు 10వేల మందికి పైగానే భక్తులు హాజరై మొక్కులు చెల్లిస్తారు.

నాలుగు రోజుల పాటు ఈ గ్రామాలన్నీ సమ్మక్క సారలమ్మ నామస్మరణతో మార్మోగుతాయి. మొత్తంగా సుమారు 5 లక్షల మందికి పైగానే భక్తులు ఇక్కడికి వస్తారని అంచనా.


హుస్నాబాద్ బస్టాండ్‌లో ఏర్పాటైన బుకింగ్ కౌంటర్

హుస్నాబాద్ బస్టాండ్‌లో బుకింగ్ కౌంటర్

- హుస్నాబాద్ నుంచి మేడారానికి

65 బస్సులు ప్రారంభం

హుస్నాబాద్, ఫిబ్రవరి 18: జాతర సందర్భంగా హుస్నాబాద్ నుంచి మేడారానికి 65 బస్సులను నడపనున్నట్లు ఆర్టీసీ డిపో మేనేజర్ వెంకటేశ్వర్లు తెలిపారు. ఆదివారం ఆయన హుస్నాబాద్ నుంచి మేడారానికి వెళ్లే బస్సులను ప్రారంభించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. హుస్నాబాద్ నుంచి మేడారానికి పెద్దలకు రూ.360, పిల్లలకు రూ. 190 చొప్పున చార్జీ వసూలు చేయనున్నట్లు చెప్పారు. ప్రయాణికులు ఇబ్బందులు కలగకుండా అన్నిరకాల ఏర్పాట్లు చేసినట్లు తెలిపారు.



మల్లన్న ఆలయ పరిసరాలలో భక్త జనసందోహం

భక్తజనహోరు

- ఐదో వారం భారీగా తరలివచ్చిన భక్తులు
- పట్నాలు రచించి బోనం నివేదన

ఎల్లమ్మ తల్లికి నివేదించేందుకు బోనాలను తీసుకెళ్తున్న భక్తులు

7 లో

ఆ ఇంట్లో ఐదుగురు ప్రభుత్వ ఉద్యోగులే

- పోటీ పరీక్షల్లో రాణించి కొలువులు సంపాదించిన ఇద్దరు అన్నదమ్ముళ్లు, సోదరి
- భర్తల బాటలోనే భార్యలకూ ఉద్యోగాలు
- ఆదర్శంగా నిలుస్తున్న వ్యవసాయ రైతు కుటుంబం


ఇరువురు కుమారులు, కోడళ్లతో అంజయ్య దంపతులు


ఉద్యోగ నియామకపత్రం అందుకుంటున్న కూతురు వనజ

చేర్యాల, ఫిబ్రవరి 18: ప్రస్తుత పోటీ ప్రపంచంలో ఏళ్ల తరబడి కష్టపడినా ప్రభుత్వ ఉద్యోగం సాధించడం ఎంతో కష్టం.. ఒక ఇంట్లో ఒకరికి ప్రభుత్వ ఉద్యోగం వస్తేనే ఎంతో సంతోషిస్తాం.. అలాంటిది ఆ ఇంట్లో ఐదుగురూ సర్కారీ కొలువులు పొంది ఔరా అనిపిస్తున్నారు. సాధారణ రైతు కుటుంబంలో పుట్టి పెరిగిన ఆ పిల్లలు.. తమ కోసం తల్లిదండ్రులు పడిన కష్టాలను తరచూ గుర్తు చేసుకుంటూ పోటీ పరీక్షల్లో రాణించి అందరితో శభాష్ అనిపించుకుంటున్నారు.

సిద్దిపేట జిల్లా చేర్యాల మండలం కడవేర్గు గ్రామానికి చెందిన గర్నెపల్లి అంజయ్య-యాదలక్ష్మిలది మధ్యతరగతి రైతు కుటుంబం. వీరికి ఇద్దరు కుమారులు, ఒక కుమార్తె సంతానం. వ్యవసాయం చేసుకుంటూ జీవనం సాగిస్తున్న ఆ దంపతులు ఎంతో కష్టపడి తమ పిల్లల్ని ఉన్నత చదువులు చదివించారు. పెద్ద కుమారుడు గర్నెపల్లి ప్రశాంత్ ఇంజనీరింగ్ పూర్తి చేసి కేంద్రప్రభుత్వ ఎలక్ట్రానిక్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా లిమిటెడ్‌లో ఒప్పంద ఉద్యోగిగానికి నియామకమై విధులు నిర్వర్తిసుండగానే, 2018లో రాష్ట్ర ప్రభుత్వం నిర్వహించిన పోటీ పరీక్షల్లో పంచాయతీ కార్యదర్శి ఉద్యోగానికి ఎంపికయ్యాడు. ప్రస్తుతం జగదేవ్‌పూర్ మండలం బస్వాపూర్‌లో విధులు నిర్వహిస్తున్నారు. చిన్నకుమారుడు గర్నెపల్లి అనిల్‌కుమార్ చార్టెడ్ అకౌంటెంట్ (సీఏ) పూర్తి చేసి కేంద్ర ప్రభుత్వ జలవనరులశాఖలో గుజరాత్ రాష్ట్రం వడోదర పట్టణంలో అకౌంట్ ఆఫీసర్‌గా ఓబీసీ కోటాలో ఆల్‌ఇండియా రెండో ర్యాంకు సాధించి ఉద్యోగం పొందాడు. 2019లో ఎలక్ట్రిసిటీ డిపార్ట్‌మెంట్‌లో అకౌంట్ ఆఫీసర్ అర్హత పరీక్షలో ఉత్తీర్ణుడయ్యాడు. దీంతో ఆ ఉద్యోగాన్ని వదిలేసి విద్యుత్‌శాఖ అకౌంట్ ఆఫీసర్‌గా చేరి జనగామ జిల్లా కేంద్రంలో విధులు నిర్వర్తిస్తున్నాడు. కుమార్తె గర్నెపల్లి వనజ డీఈడీ చదివి 2018లో సర్వశిక్షఅబియాన్ ఇచ్చిన నోటిఫికేషన్ ద్వారా ప్రతిభ చూపింది. రాష్ట్ర ప్రభుత్వ విద్యాశాఖలో స్పెషల్ టీచర్‌గా 2022 నుంచి సిద్దిపేట జిల్లా మర్కుక్ మండలంలో విధులు నిర్వర్తిస్తున్నది. కుమారుల బాటలోనే కోడళ్లు కూడా ఉన్నత చదువులు చదివి ఉద్యోగాలు పొందారు. ప్రశాంత్ భార్య గర్నెపల్లి దీక్ష ఉస్మానియాలో జీఎన్ఎమ్, ఫార్మసీ చదివి 2023లో రాష్ట్ర ప్రభుత్వం నిర్వహించిన నర్సింగ్ ఆఫీసర్ రిక్రూట్‌మెంట్ మూడవ జోన్‌లో 12వ ర్యాంకు సాధించి మెరిట్‌తో సిద్దిపేట మెడికల్ కాలేజీలో పోస్టింగ్ పొంది విధులు నిర్వహిస్తున్నారు. అనిల్‌కుమార్ భార్య ప్రత్యూష ఇంజనీరింగ్ పూర్తి చేసి యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియాలో క్లర్క్‌గా ఉద్యోగం పొందారు. జనగాం జిల్లా దేవరుప్పల బ్రాంచిలో విధులు నిర్వహిస్తున్నారు. ఇలా ఒకే కుటుంబంలో ఐదు ప్రభుత్వ ఉద్యోగాలు పొందిన వారంతా యువతకు ఆదర్శంగా నిలుస్తున్నారని గ్రామస్తులు బంధువులు అభినందిస్తున్నారు.

తల్లిదండ్రుల కష్టాలు కదలించాయి

- గర్నెపల్లి ప్రశాంత్



వ్యవసాయంలో అమ్మనాన్నలు పడిన కష్టాలను చిన్నప్పటి నుంచి చూస్తున్నాం. అవి మమ్మల్ని కదలించాయి. తాము కష్టపడి మంచిగా చదివి ప్రయోజకులమైతేనే సమస్యలు పరిష్కారమవుతాయని గ్రహించాం. అమ్మానాన్నల స్ఫూర్తితోనే విజయం సాధించాం. మమ్మల్ని చూసి కొంతమందైనా తల్లిదండ్రుల కలలను నెరవేరుస్తారని ఆశిస్తున్నాం.

మార్కెట్ కమిటీల ఏర్పాటుకు సన్నాహాలు

- కాంగ్రెస్ నేతల్లో చిగురిస్తున్న ఆశలు

సిద్దిపేట అగ్రికల్చర్, ఫిబ్రవరి 18 : రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న వ్యవసాయ మార్కెట్ కమిటీలను రద్దు చేస్తూ ప్రభుత్వం ఇటీవల ఉత్తర్వులు జారీ చేసింది. సీఎం రేవంత్‌రెడ్డి గత ప్రభుత్వం నియమించిన మార్కెట్ పాలకవర్గాలను రద్దు చేస్తున్నట్లు ప్రకటించడంతో పాటు కొత్తపాలకవర్గాల ఏర్పాటుకు సన్నాహాలు చేయాలని మంత్రులు, ఎమ్మెల్యేలకు సూచించారు.

జిల్లాలో 14 వ్యవసాయ మార్కెట్ కమిటీలు

సిద్దిపేట జిల్లాలోని 14 మార్కెట్‌లో కేవలం 13 మార్కెట్లకు ఛైర్మన్లు ఉన్నారు. కొండపాక మండల మార్కెట్‌కు పాలకవర్గం ఏర్పాటు కాలేదు. గత ప్రభుత్వ హయాం నుంచే పాలకవర్గం ఏర్పాటుకు ప్రతిపాదనలు పంపించినా పలు కారణాల వల్ల భర్తీకి నోచుకోలేదు. జిల్లాలోని సిద్దిపేట, చిన్నకోడూరు, గజ్వేల్, హుస్నాబాద్, కోహెడ, దౌల్తాబాద్, దుబ్బాక, వంటిమామిడి, తొగుట, చేర్యాల, బెజ్జంకి మార్కెట్‌ల పాలకవర్గాలను రద్దు చేశారు. మిరుదొడ్డి, నంగునూరు మార్కెట్ కమిటీల పాలకవర్గాల పదవీకాలం జూలైలోనే ముగిసింది. ఈ మార్కెట్ కమి



టీలకు ఇంతకాలం ఇన్‌చార్జి అధికారులను నియమించారు. అయితే, మొత్తం మార్కెట్ల పాలకవర్గాలు రద్దు చేయడంతో కొత్త పాలకవర్గాల ఏర్పాటుపై నేతలు కసరత్తు చేస్తున్నారు.

పదవుల కోసం ప్రయత్నాలు

జిల్లాలో కాంగ్రెస్‌కు చెందిన హుస్నాబాద్ నియోజకవర్గం ఎమ్మెల్యే, మంత్రి పొన్నం ప్రభాకర్ ఒక్కరే ఉన్నారు. ఆయన పరిధిలో ఉండే మార్కెట్లకు పాలకవర్గాన్ని ఏర్పాటు చేసేందుకు నేరుగా ప్రతిపాదనలు పంపించే అవకాశం ఉంటుంది. ఇతర పార్టీలకు చెందిన ఎమ్మెల్యేలు ఉన్నచోట ఇన్‌చార్జి మంత్రి కొండా సురేఖ పాలకవర్గం ఏర్పాటు కోసం ప్రతిపాదనలు పంపించాల్సి ఉంటుంది. ఈ తరుణంలో అనేక మంది కాంగ్రెస్ నేతలు మార్కెట్ పదవులపై ఆశలు పెట్టుకున్నారు. పదవి పొందాలంటే ఆయా మార్కెట్ పరిధిలోని గ్రామానికి చెందిన రైతులు అయి ఉండాలి. ఇప్పటికే పలువురు ఛైర్మన్, వైస్ ఛైర్మన్ పదవుల కోసం ప్రయత్నాలు మొదలుపెట్టారు. గతంలో మాదిరిగా పాలకవర్గాన్ని ఏర్పాటు చేయాలని ప్రభుత్వం ఆదేశిస్తే మార్కెట్ల వారీగా ఇప్పటికే రిజర్వేషన్లు ఖరారయ్యాయి. గత ప్రభుత్వం అమలు చేసిన రిజర్వేషన్లపై స్పష్టత రావాల్సి ఉంది.

మార్కెట్ కమిటీలో 18 మంది సభ్యులు

కొత్తగా ఏర్పాటయ్యే ప్రతి మార్కెట్ కమిటీ కార్యవర్గంలో ఛైర్మన్, వైస్‌ఛైర్మన్‌తో కలిపి 18 మంది సభ్యులు ఉంటారని, వీరిలో 12 మంది నామినేటెడ్ సభ్యులు, ఇద్దరు అధీకృత వ్యాపారులు (లైసెన్స్ ట్రేడర్స్), నలుగురు ఎక్స్ అఫీషియో సభ్యులు ఉండనున్నారు. ఇక పాలకవర్గ పదవీకాలం రెండేళ్లు ఉంటుంది. రెండుసార్లు అదనంగా ఆరు నెలలు పొడిగించే అవకాశం ఉండనున్నది. ఛైర్మన్లు, వైస్‌ఛైర్మన్లు, సభ్యుల ఎంపికలో అన్ని వర్గాల వారికి ప్రాధాన్యం ఇవ్వనున్నారు.

విద్యార్థినిపై ప్రిన్సిపాల్ లైంగిక వేధింపులు

- అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించిన పోలీసులు
- ఆలస్యంగా వెలుగులోకి

పుల్‌కల్, ఫిబ్రవరి 18: పిల్లలకు విద్యాబుద్ధులు నేర్పించి, వారిని భావి, భారత పౌరులుగా తీర్చిదిద్దాల్సిన ఓ ప్రిన్సిపాల్ సదరు పాఠశాల విద్యార్థిని పట్ల అసభ్యకరంగా ప్రవర్తించి, వేధింపులకు గురిచేయడంతో పోలీసులు అరెస్ట్‌చేసి, రిమాండ్‌కు తరలించారు. ఈ సంఘటన ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. సంగారెడ్డి జిల్లా పుల్కల్ మండలంలోని సర్ వైస్రాయ్ ప్రైవేట్ పాఠశాలలో ఓ గ్రామానికి చెందిన విద్యార్థిని పదో తరగతి చదువుతున్నది. స్కూల్ ప్రిన్సిపాల్ షేక్ అహ్మద్ సంగారెడ్డి నుంచి పుల్కల్‌కు తన కారులో వస్తుంటారు.

సదరు విద్యార్థిని గ్రామం కూడా అదే దారిలోనే ఉండడంతో నాలుగురోజుల క్రితం గ్రామంలో దింపుతానంటూ ఆమెను కారులో ఎక్కించుకున్నారు. దారి మధ్యలో కారులో బాలిక పట్ల అసభ్యకరంగా ప్రవర్తించారు. భయభ్రాంతులకు గురైన బాలిక ఈ విషయాన్ని తల్లిదండ్రులకు చెప్పింది. మరుసటి రోజు తల్లిదండ్రులు పాఠశాలకు వెళ్లగా.. ప్రిన్సిపాల్ పాఠశాలకు రావడం లేదని సిబ్బంది తెలిపారు. ఇలా నాలుగు రోజులపాటు ప్రిన్సిపాల్ పాఠశాలకు రాకపోవడంతో విషయాన్ని మండల విద్యాశాఖ అధికారి దండు అంజయ్య దృష్టికి తీసుకెళ్లారు. స్పందించిన ఎంఈవో చైల్డ్ హెల్ప్‌లైన్‌కు సమాచారమందించారు. చైల్డ్ హెల్ప్‌లైన్, భరోసా కేంద్రం అధికారుల ఆదేశాల మేరకు పుల్కల్ ఎస్ఐ శ్రీకాంత్ ప్రిన్సిపాల్ షేక్ అహ్మద్‌పై కేసు నమోదు చేశారు. శనివారం అరెస్ట్ చేసి కోర్టులో హాజరుపర్చగా, జోగిపేట మున్సిఫ్ కోర్టు న్యాయాధికారి రిమాండ్ విధించారు.




రాజయ్యకు సురేష్ షెట్కార్ సన్మానం



రాజయ్యకు పుష్పగుచ్ఛాన్ని అందజేస్తున్న సురేష్ షెట్కార్

నారాయణఖేడ్, ఫిబ్రవరి 18: రాష్ట్ర ఫైనాన్స్ కమిషన్ చైర్మన్‌గా నియమితులైన సిరిసిల్లా రాజయ్యను ఆదివారం మాజీ ఎంపీ, టీపీసీసీ సీనియర్ ఉపాధ్యక్షుడు సురేష్ షెట్కార్ హైదరాబాద్‌లో శాలువాతో సన్మానించి, పుష్పగుచ్ఛాన్ని అందజేసి శుభాకాంక్షలు తెలిపారు. రాజయ్య, షెట్కార్, ఇరువురు కలిసి ఒక పర్యాయం ఎంపీలుగా కొనసాగిన నాటి జ్ఞాపకాల్ని గుర్తుచేసుకున్నారు.



ప్రభుత్వ కార్యాలయాల్లో అపరిశుభ్రత

జహీరాబాద్, ఫిబ్రవరి 18: జహీరాబాద్ పట్టణంలోని పలు ప్రభుత్వ కార్యాలయాలు అపరిశుభ్రతకు నిలయాలుగా మారాయి. చెట్ల ఎండిన ఆకులు, పిచ్చిమొక్కలతో దర్శనమిస్తున్నాయి. గతంలో ఆయా ప్రభుత్వకార్యాలయాల పరిసరాలు పరిశుభ్రంగా ఉండేలా పచ్చదనం, పరిశుభ్రతను వారానికోరోజు పాటించేవారు. ప్రస్తుతం ఆ పద్ధతి పూర్తిగా కనుమరుగైంది. పట్టణంలోని ఆర్అండ్‌బీ కార్యాలయం, ఆర్అండ్‌బీ గెస్ట్‌హౌజ్, ఇరిగేషన్ కార్యాలయం, అటవీ శాఖ కార్యాలయం, తహసీల్దార్, ఎంపీడీవో, పంచాయతీరాజ్ తదితర కార్యాలయాలు అపరిశుభ్రతకు నిలయాలుగా మారాయి. సంబంధిత శాఖలకు చెందిన అధికారులు వారి వారి కార్యాలయాల పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోకపోవడంతో ప్రజలు అధికారుల పనితీరుపై ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

బీఎంఎస్ రాష్ట్ర ఉపాధ్యక్షుడిగా ప్రదీప్‌కుమార్



సంగారెడ్డి అర్బన్, ఫిబ్రవరి 18 : భారతీయ మజ్దూర్ సంఘ్ రాష్ట్ర ఉపాధ్యక్షుడిగా ఎ.ప్రదీప్‌కుమార్ నియమితమయ్యాడు. గోదావరిఖనిలో జరిగిన బీఎంఎస్ రాష్ట్ర మహాసభల్లో రాష్ట్ర కార్యవర్గంలో ఆయనకు చోటు దక్కింది. రాష్ట్ర ఉపాధ్యక్షుడిగా నియమితుడైన ప్రదీప్‌కుమార్‌కు జిల్లా కార్యదర్శి పీ.మోహన్‌రెడ్డి శుభాకాంక్షలు తెలిపారు. ప్రదీప్‌కుమార్ నియామకంతో జిల్లాలో కార్మిక వర్గానికి మేలు జరుగుతుందని ఆయన ధీమావ్యక్తం చేశారు.

ఏరియా వైద్యశాలలో రక్తదాన శిబిరం



రక్తదానం చేస్తున్న యువకులు

నారాయణఖేడ్, ఫిబ్రవరి 18: జగద్గురు స్వామి నరేంద్రచార్య ట్రస్టు ఆధ్వర్యంలో ఆదివారం నారాయణఖేడ్ ఏరియా వైద్యశాలలో రక్తదాన శిబిరం నిర్వహించారు. ఈ శిబిరంలో 46 మంది రక్తదానం చేశారు. స్వామి నరేంద్రచార్య ట్రస్టు ద్వారా ఆధ్యాత్మిక, సామాజిక, కార్యక్రమాలను కూడా చేపడుతున్నామని నిర్వాహకులు తెలిపారు. కార్యక్రమంలో స్వామి నరేంద్రచార్య భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

కుక్కల దాడిలో మేక పిల్లల మృతి

మద్దూరు, ఫిబ్రవరి 18 : కుక్కల దాడిలో మేక పిల్లలు మత్యువాతపడ్డ సంఘటన మద్దూరు మండలంలోని నర్సాయపల్లిలో చోటుచేసుకున్నది. బాధితుడు ఎల్లయ్య కథనం ప్రకారం..గ్రామం పక్కన ఏర్పాటు చేసిన దొడ్డిలో ఉన్న మేక పిల్లలను శనివారం రాత్రి కుక్కలు చంపాయన్నారు. కుక్కల నివారణకు చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు.

సైబర్ నేరాల పట్ల అప్రమత్తంగా ఉండాలి

● తొగుట సీఐ లతీఫ్



కార్యక్రమంలో మాట్లాడుతున్న సీఐ

రాయపోల్, ఫిబ్రవరి 18: సైబర్ నేరాల పట్ల ప్రతి ఒక్కరూ అప్రమత్తంగా ఉండాలని తొగుట సీఐ లతీఫ్ సూచించారు. శనివారం రాత్రి రాయపోల్ మండలం సయ్యద్‌నగర్ గ్రామంలో పోలీసు కళాబృందం కనువిప్పు అనే కార్యక్రమాన్ని నిర్వహించి ప్రజలను చైతన్యపరిచింది. ఈ కార్యక్రమంలో రాయపోల్ ఎస్ఐ రఘుపతితో కలిసి పాల్గొన్న సీఐ మాట్లాడుతూ గుర్తుతెలియని వ్యక్తులు ఫోన్ చేస్తే బ్యాంకు వివరాలు, ఏటీఎం కార్డు వివరాలు చెప్పవద్దని హెచ్చరించారు. గ్రామాల్లో అపరిచిత వ్యక్తులు కనిపిస్తే పోలీసులకు సమాచారం ఇవ్వాలని, మూఢనమ్మకాలు నమ్మవద్దని పేర్కొన్నారు.

మల్కాపూర్‌లో 401వ వారం స్వచ్ఛభారత్

తూప్రాన్, ఫిబ్రవరి 18: మండలంలోని మల్కాపూర్ ఆదర్శ గ్రామంలో ఆదివారం 401వ వారం స్వచ్ఛభారత్ కార్యక్రమం నిర్వహించారు. మల్కాపూర్ గ్రామంలోని గ్రామ పంచాయతీ వద్ద ఆరో వార్డులో స్వచ్ఛభారత్ నిర్వహించి, రోడ్లను శుభ్రం చేశారు. కార్యక్రమంలో మేకిన్ మల్కాపూర్ యువతతోపాటు, తాజా మాజీ ఉపసర్పంచ్ ఆంజనేయులుగౌడ్, గ్రామ పంచాయతీ కార్యదర్శి అరుణ, తదితరులు పాల్గొన్నారు.


జీడిపల్లిలో రెండో వారం స్వచ్ఛ భారత్

మనోహరాబాద్, ఫిబ్రవరి 18: గ్రామ అభివృద్ధే లక్ష్యంగా గ్రామ యువకులు నడుం బిగించి పరిశుభ్రతలో భాగంగా ముందుకు సాగుతున్నారు. మండలంలోని జీడిపల్లి గ్రామ యువకులు గ్రామంలో 2వ వారం స్వచ్ఛ భారత్ కార్యక్రమాన్ని నిర్వహించారు. కార్యక్రమంలో గ్రామ నేచర్ ఐకాన్ యూత్ సభ్యులు పాల్గొన్నారు.


పోగొట్టుకున్న బ్యాగు అందజేత

చేర్యాల, ఫిబ్రవరి 18 : కొమురవెల్లి మల్లికార్జునస్వామి దేవాలయ సందర్శనార్థం వచ్చిన కరీంనగర్ జిల్లా సుందరగిరికి చెందిన అనూష ఆదివారం స్వామివారిని దర్శించుకుని బయటకు వస్తుండగా, వెనకదారి మెట్ల ఆవరణలో తన బ్యాగు పోగొట్టుకున్నది. బ్యాగులో విలువైన వస్తువులు, మూడు స్మార్ట్‌ఫోన్‌లు ఉన్నాయి. బ్యాగును గుర్తించిన షాద్‌నగర్‌కు చెందిన జి.వెంకటేశ్ అనే భక్తుడు బ్యాగును ఆలయ ఆవరణలోని పోలీస్ కంట్రోల్‌రూంలో అప్పగించాడు. ఎస్ఐ నాగరాజు ఆ బ్యాగును అనూషకు అందజేశారు. నిజాయితీ చాటుకున్న వెంకటేశ్‌ను అభినందించారు.









స్టోన్ క్రషర్లపై చర్యలు తీసుకోవాలి

జిన్నారం, ఫిబ్రవరి 18: ఇష్టారాజ్యంగా పేలుళ్లు చేపడుతున్న స్టోన్‌క్రషర్లపై చర్యలు తీసుకోవాలని మాదారంలో యువజనులు, స్థానిక ప్రజలు ధర్నా నిర్వహించారు. ఆదివారం మాదారం యువజన నాయకులు విజయ్‌గౌడ్, సుదర్శన్, అంబదాసు, రమణిసింగ్, గణేష్, శ్రీనివాస్, వెంకటేశంగౌడ్, చంద్రశేఖర్, పాండు, సంపత్ తదితరులు స్థానిక స్టోన్‌క్రషర్ వద్ద ధర్నా నిర్వహించారు. ప్రజాభిప్రాయ సేకరణ నిర్వహించకుండానే తమ గ్రామ శివారులో క్రషర్లు ఏర్పాటు చేశారని, నిత్యం భారీ పేలుళ్లతో పాటు వాయుకాలుష్యం వల్ల తీవ్ర ఇక్కట్లు పడుతున్నామని మండిపడ్డారు. వెంటనే అక్రమ క్వారీ, క్రషర్లపై చర్యలు చేపట్టాలని వారు డిమాండ్ చేశారు.



స్టోన్‌క్రషర్ వద్ద ధర్నా చేస్తున్న యువజన నాయకులు

పొద్దు తిరుగుడులో తేనెటీగల పెంపకం

● తక్కువ పెట్టుబడితో అదనపు ఆదాయం ● నూతన పద్ధతులపై రైతులకు అవగాహన



రైతులు సాగుచేస్తున్న పొద్దు తిరుగుడు పంట

నారాయణరావుపేట, ఫిబ్రవరి 18: వేరుశనగ పంట తర్వాత అధిక విస్తీర్ణంలో సాగుచేసే పంటల్లో పొద్దు తిరుగుడు ఒకటి. పంట మార్పిడిలో భాగంగా వ్యవసాయ శాఖ అధికారుల సూచనలతో పొద్దు తిరుగుడు పంటతో పాటు తేనెటీగల పెంపకంతో అధిక దిగుబడులు పొందుతున్నారు సిద్దిపేట జిల్లా నారాయణరావుపేట మండలం లక్ష్మీదేవిపల్లి గ్రామ రైతులు. మండలంలోని ఆయా గ్రామాల్లో మొత్తం 250 ఎకరాల్లో పొద్దు తిరుగుడు పంటను సాగుచేస్తున్నారు. ఈ పంటకు తక్కువ పెట్టుబడి, తక్కువ కాలపరిమితి ఉండడంతో చాలా మంది రైతులు సాగుచేసేందుకు ఆసక్తి చూపుతున్నారు. పంట దిగుబడి పెంచడంతో పాటు అదనపు ఆదాయం ఆర్జించవచ్చని అధికారుల సూచనలతో లక్ష్మీదేవిపల్లి గ్రామానికి చెందిన రైతులు బాక్సుల్లో తేనెటీగలను పెంచుతున్నారు. పంట మూడునెలల కాలానికి ఎకరాకు రూ.12 వేల పెట్టుబడి కాగా.. రూ.35 వేల నుంచి రూ.45వేల వరకు ఆదాయం పొందుతున్నారు. అయితే కొద్దిపాటి యాజమాన్య పద్ధతులు పాటిస్తే రైతులకు మంచి ఆదాయం సమకూరుతుందని వ్యవసాయ అధికారులు పేర్కొంటున్నారు.

తక్కువ పెట్టుబడి.. ఎక్కువ లాభాలు

పొద్దు తిరుగుడులో పరపరాగ సంపర్కంతో గింజలు ఏర్పడుతాయి. పరపరాగ సంపర్కం సరిగ్గా జరగకపోవడం వల్ల గింజ తాలు ఏర్పడి దిగుబడి తగ్గిపోతుంది. దీన్ని అధిగమించేందుకు తేనెటీగల పెంపకం చాలా దోహదపడుతుంది. ప్రస్తుతం అధిక మోతాదులో రసాయనిక ఎరువులు వాడడం వల్ల తేనెటీగలు అంతరించిపోతున్నాయి. దీంతో పరపరాగ సంపర్కం ఉండే పంటల్లో దిగుబడి రోజురోజుకూ తగ్గిపోతున్నది. ఈ సమస్యను అధిగమించి లాభాలు పొందేందుకు రైతులు పొద్దు తిరుగుడు పంటతో పాటు తేనెటీగల పెంపకం చేపడుతున్నారు. పొద్దు తిరుగుడు పూత దశకు రాగానే తేనెటీగలను వదలడం వల్ల గింజ పూర్తిగా కట్టడంతో పాటు ఎకరాకు 12 క్వింటాళ్లకుపైగా దిగుబడి పొందొచ్చని చెబుతున్నారు. తేనెటీగల పెంపకం ద్వారా స్వచ్ఛమైన తేనెతో పాటు అదనపు ఆదాయం పొందుతున్నారు. స్వచ్ఛమైన తేనెతో పాటు వచ్చిన మైనాన్ని ఎన్నో ఉత్పత్తుల్లో వినియోగించడం వల్ల మార్కెట్‌లో డిమాండ్ ఉన్నది. తక్కువ పెట్టుబడి.. ఎక్కువ లాభాలు ఉండడంతో చాలామంది రైతులు నూతన పద్ధతిలో సాగుచేసే దిశగా అడుగులు వేస్తున్నారు.



పొద్దు తిరుగుడు పంట మధ్య బాక్సుల్లో పెంచుతున్న తేనెటీగలు

తేనెటీగలతో తాలు గింజలు తగ్గిపోతాయి



పొద్దు తిరుగుడు పంటలో తేనెటీగలను వదిలినప్పుడు తాలు గింజలు పూర్తిగా తగ్గిపోతాయి. పువ్వు సంపూర్ణంగా గింజ కడుతున్నది. సాధారణంగా సాగుచేసే పద్ధతిలో కంటే ఒక క్వింటాలు అధిక దిగుబడిని పొందుతున్నాం. పొద్దు తిరుగుడు పంటలో తేనెటీగలు పెంచడం వల్ల అదనంగా ఆదాయం పొందవచ్చు.

\- మొగుళ్ల పెద్ద భూంమల్లయ్య, రైతు, లక్ష్మీదేవిపల్లి

సాగులో నూతన పద్ధతులు



రైతులు రోజురోజుకు మెళకువలు పాటిస్తూ సాగుచేస్తున్నారు. ప్రస్తుతం చాలామంది రైతులు పొద్దు తిరుగుడు సాగులో తేనెటీగల పెంపకంపై ఆసక్తి చూపుతున్నారు. అంతేకాకుండా సాగుచేసిన పొద్దు తిరుగుడు పంట నుంచి ఉత్పత్తి అయిన నాణ్యత గల తేనేను వినియోగదారులు తీసుకునేందుకు ఇష్టపడుతున్నారు.

నాగార్జున, వ్యవసాయ విస్తరణ అధికారి, నారాయణరావుపేట

యోగాతో సంపూర్ణ ఆరోగ్యం: ఎమ్మెల్సీ

గజ్వేల్ రూరల్, ఫిబ్రవరి 18: యోగాతో సంపూర్ణ ఆరోగ్యం లభిస్తున్నదని ఎమ్మెల్సీ వంటేరి యాదవరెడ్డి అన్నారు. గజ్వేల్ మండలం కోమటిబండ గ్రామంలోని శ్రీపంచ పాండవ పిరమిడ్ ధ్యాన కేంద్రం ఆరో వార్షికోత్సవాన్ని ట్రస్టు నిర్వాహకులు ఆదివారం నిర్వహించారు. డాక్టర్ ఎమ్మెల్సీ యాదవరెడ్డి ముఖ్యఅతిథిగా విచ్చేసి జ్యోతి వెలిగించి మాట్లాడారు. క్రమం తప్పకుండా ధ్యానం, యోగా చేస్తే సంపూర్ణ ఆరోగ్యం లభిస్తున్నదని చెప్పారు. ఆధునిక సమాజంలో ప్రతి రంగంలో పోటీ నెలకొనడంతో ఒత్తిడి గురవుతూ పలురకాల అనారోగ్య సమస్యలు వస్తున్నాయన్నారు. యోగా, ధ్యానం అలవాటు చేసుకుంటే ఒత్తిడిని అధిగమించొచ్చని సూచించారు. పిరమిడ్ ట్రస్టు చేస్తున్న సేవలను అభినందిస్తూ.. ఇలాంటి కార్యక్రమాలను గ్రామస్థాయిలో అందరికీ తెలియజేయాలని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో గజ్వేల్ మున్సిపల్ చైర్మన్ రాజమౌళి, కౌన్సిలర్లు ఉప్పల మెట్టయ్య, తలకొక్కుల భాగ్యలక్ష్మీదుర్గాప్రసాద్, గోపాల్‌రెడ్డి, నిర్వాహకులు పీ.నర్సింహులు, బాల్‌రెడ్డి, రాజిరెడ్డి వెంకట్‌రెడ్డి, వేణు, ప్రశాంత్, నర్సింగరావు, బాలు, బ్రహ్మచారి గ్రామస్థులు పాల్గొన్నారు.



పిరమిడ్ ధ్యాన కేంద్ర వార్షికోత్సవంలో మాట్లాడుతున్న ఎమ్మెల్సీ వంటేరి యాదవరెడ్డి

భార్య కాపురానికి రావడం లేదని భర్త ఆత్మహత్య



చంద్రం(ఫైల్)

శివ్వంపేట, ఫిబ్రవరి 18: భార్య కాపురానికి రావడం లేదని మనస్థాపానికి గురైన భర్త ఇంట్లో ఉరేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. స్థానికులు, పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. శివ్వంపేట మండలం కొంతాన్‌పల్లి గ్రామానికి చెందిన అంకర్ల చంద్రం(28)కు చేగుంట మండలానికి చెందిన సౌందర్యతో ఏడాదిన్నర క్రితం వివాహమైంది. అయితే మద్యానికి బానిసైన చంద్రం భార్యతో తరచూ గొడవపడేవాడు. ఐదునెలల క్రితం సౌందర్య ప్రసవం కోసం పుట్టింటికి వెళ్లింది. శనివారం భార్య, పుట్టిన బాబును చూసి ఇంటికి వచ్చాడు. రాత్రి ఒంటిగంట సమయంలో ఇంట్లో ఉరివేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. తెల్లవారుజామున కుటుంబీకులు చూడగా వేలాడుతూ కనిపించాడు. కాగా మీ వల్లనే చనిపోయాడంటూ భార్య సౌందర్యతో పాటు వచ్చిన వారిపై చంద్రం కుటుంబీకులు దాడికి యత్నించారు. అయితే అక్కడే ఉన్న స్థానికులు అడ్డుకుని వారిని శాంతపరిచారు. కుటుంబీకుల ఫిర్యాదు మేరకు మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం నర్సాపూర్ ప్రభుత్వాసుపత్రికి తరలించి కేసు నమోదు చేసుకకుని దర్యాప్తు చేస్తున్నారు.

ఇంటర్నేషనల్ కిక్ బాక్సింగ్‌లో విద్యార్థి ప్రతిభ



వెండి పతకాలు సాధించిన నిఖిల్

హత్నూర, ఫిబ్రవరి 18: హత్నూర మండల పరిధిలోని గుండ్లమాచునూర్ గ్రామానికి చెందిన మన్నె నిఖిల్ అత్యుత్తమ ప్రతిభ కనబరిచి రెండు వెండి పతకాలను సాధించాడు. ఇటీవల దేశ రాజధాని ఢిల్లీలో నిర్వహించిన ఇంటర్నేషనల్ కిక్ బాక్సింగ్ పోటీల్లో 20 దేశాలకు చెందిన క్రీడాకారులు పాల్గొన్నారు. అందులో భారతదేశం నుంచి అండర్-14 విభాగంలో పాల్గొన్న నిఖిల్ రెండు వెండి పతకాలను సాధించాడు. దీంతో ఆయన శిక్షకులతో పాటు కుటుంబీకులను గ్రామస్థులు అభినందించారు.

బ్రెయిన్ డెడ్ వ్యక్తి అవయవాలు దానం



అంజనేయులుగౌడ్

గజ్వేల్ టౌన్, ఫిబ్రవరి 18: రోడ్డు ప్రమాదంలో గాయపడి బ్రెయిన్ డెడ్ అయిన వ్యక్తి అవయవాలు దానం చేశారు. గజ్వేల్ మండలం పల్లెపహాడ్ ఆర్అండ్ఆర్ కాలనీకి చెందిన కేసరి అంజనేయులుగౌడ్ రెండురోజుల క్రితం జరిగిన రోడ్డు ప్రమాదంలో గాయపడ్డాడు. గాయపడిన అంజనేయులుగౌడ్‌ను చికిత్స కోసం యశోద ఆస్పత్రికి తరలించగా.. వైద్యులు బ్రెయిన్ డెడ్ అయినట్లుగా నిర్ధారించారు. వైద్యుల కౌన్సిలింగ్‌తో భార్య లలిత, కూతుర్లు జ్యోతి, లావణ్య ఝాన్సీ, భార్గవి, అల్లుడు రమేష్‌గౌడ్ అవయవ దానం చేసేందుకు ముందుకు వచ్చారు. అంజనేయులు గౌడ్ అవయవ దానంతో పలువురికి ప్రాణదానం చేశారు.

శివాజీ జయంతిని శాంతియుతంగా నిర్వహించుకోవాలి: ఏసీపీ



శివాజీ విగ్రహం ప్రాంతాన్ని పరిశీలిస్తున్న ఏసీపీ బాలాజీ

గజ్వేల్ టౌన్, ఫిబ్రవరి 18: శివాజీ జయంతిని శాంతియుతంగా నిర్వహించుకోవాలని గజ్వేల్ ఏసీపీ బాలాజీ సూచించారు. ఆదివారం గజ్వేల్‌లోని శివాజీ విగ్రహ ప్రాంతం, శ్రీఉమా మహేశ్వర ఆలయం పరిసరాలను సీఐ సైదాతో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ శివాజీ జయంతిని శాంతియుతంగా నిర్వహించుకోవాలని, శోభాయాత్రలో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా చూసుకోవాలన్నారు. కాగా ఛత్రపతి శివాజీ జయంతి కోసం సిద్ధమవుతున్న ప్రాంతాన్ని పరిశీలించి, నిర్వాహకులను వివరాలు అడిగి తెలుసుకున్నారు. శోభాయాత్ర సందర్భంగా తీసుకోవాల్సిన జాగ్రత్తలను తెలిపారు.

చేర్యాల కవులకు సన్మానం

చేర్యాల, ఫిబ్రవరి 18: అంతర్జాతీయ మాతృభాషా దినోత్సవాన్ని పురస్కరించుకుని శ్రీవాణిసాహితీ పరిషత్, సిద్దిపేట రచయితల సంఘం సంయుక్త ఆధ్వర్యంలో ఆదివారం జిల్లా కేంద్రంలో నిర్వహించిన కవి సమ్మేళనంలో చేర్యాల కవులు అత్యుత్తమ ప్రతిభ కనబరిచారు. ఈ సందర్భంగా ఎలికట్టె అయిలయ్య, వుప్పల ప్రభాకర్, పి.జనార్దన్, ఎం.రామచంద్ర మూర్తి కవి సమ్మేళనంలో సాహితీ సౌరభాలను వ్యాపింపజేయడంతో నిర్వాహకులు సత్కరించారు.

బైక్ అదుపు తప్పి ఐదుగురికి గాయాలు

● కోతి అడ్డురావడంతో ప్రమాదం



ప్రమాదంలో గాయపడిన చిన్నారులు

మాసాయిపేట, ఫిబ్రవరి 18: బైక్‌కు కోతి అడ్డురావడంతో అదుపుతప్పి కిందపడగా ఐదుగురికి గాయాలయ్యాయి. కామారెడ్డికి చెందిన జ్ఞానేశ్వర్, సవిత తమ ముగ్గురు కూతుళ్లు భానుప్రియ(6), సాయిశృతి (3), చందన (8నెలలు)లతో కలిసి బైక్‌పై హైదరాబాద్ నుంచి కామారెడ్డి వైపు వస్తున్నారు. అయితే మండల కేంద్రమైన మాసాయిపేటలోని బంగారమ్మ ఆలయ సమీపంలోకి రాగానే బైక్‌కు అకస్మాత్తుగా కోతి అడ్డు వచ్చింది. దీంతో బైక్ అదుపుతప్పి కిందపడగా ఐదుగురికి తీవ్ర గాయాలయ్యాయి. స్థానికులు వారిని వెంటనే 108 అంబులెన్స్‌లో తూప్రాన్ ప్రభుత్వాస్పత్రికి తరలించారు. ఇటీవల కోతుల బెడదతో పలు ప్రమాదాలు సంభవిస్తున్నాయని, కోతుల బెడదను నివారించాలని పలువురు కోరుతున్నారు.

ఇసుకను అక్రమంగా తరలిస్తున్న ట్రాక్టర్ సీజ్

చేగుంట/వెల్దుర్తి, ఫిబ్రవరి 18: ఇసుకను అక్రమంగా రవాణా చేస్తున్న ట్రాక్టర్‌ను సీజ్ చేసి కేసు నమోదు చేసినట్లు నార్సింగి ఎస్ఐ అహ్మద్ మోహిఉద్దీన్ తెలిపారు. మండల పరిధిలోని శేరిపల్లి గ్రామంలో ఇసుకను అక్రమంగా తరలిస్తున్నారన్న సమాచారంతో దాడిచేసి ట్రాక్టర్‌ను సీజ్‌చేసి మైనింగ్ అధికారులకు అప్పగించామని వెల్లడించారు. మండలంలో ఎవరైనా ఇసుక, మట్టి అనుమతులు లేకుండా తరలిస్తే చట్టరీత్యా కఠిన చర్యలు తీసుకుంటామని ఎస్ఐ హెచ్చరించారు. అలాగే హల్దీ వాగు నుంచి ఆదివారం అక్రమంగా తరలిస్తున్న ఇసుక ట్రాక్టర్‌ను పట్టుకుని కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ నవతగౌడ్ తెలిపారు. మండల పరిధిలోని నేల్లూరు గ్రామంలోని హల్దీవాగులో ఇసుకను ట్రాక్టర్‌లో నింపుకుని తూప్రాన్ వైపు వెళ్తుండగా.. హస్తాల్‌పూర్ గ్రామ శివారు వద్ద పట్టుకున్నట్లు ఎస్ఐ తెలిపారు.





రాజగోపుర ప్రాంగణంలో భక్తజన సందోహం, కిక్కిరిసిన గంగిరేగుచెట్టు ప్రాంగణం

ఐదోవారం.. భక్తజన హోరు

● మల్లన్నను దర్శించుకున్న అశేష భక్తజనం

● పట్నాలు రచించి, బోనాలు నివేదన

చేర్యాల, ఫిబ్రవరి 18: కొమురవెల్లి మల్లికార్జునస్వామి బ్రహ్మోత్సవాల్లో భాగంగా ఐదోవారాన్ని పురస్కరించుకుని ఆదివారం భక్తులు భారీగా తరలివచ్చారు. ఈ సందర్భంగా తలనీలాలు సమర్పించి కోనేరులో పుణ్యస్నానమాచరించారు. భక్తిప్రపత్తులతో బోనం నివేదించి పట్నాలు రచించారు. స్వామివారిని దర్శించుకుని పట్టువస్త్రాలు, బండారి, ఒడిబియ్యం సమర్పించి మొక్కులు తీర్చుకున్నారు. ఎల్లమ్మతల్లికి కల్లు, బెల్లంపానకం శాకపెట్టి బోనం నివేదించారు. తమను చల్లగా కాపాడమని వేడుకున్నారు. తమ కోరికలు ఈడేర్చమని వేడుకుంటూ గంగరేగుచెట్టుకు ముడుపులు కట్టారు. భక్తుల రద్దీ అధికంగా ఉండటంతో వీఐపీ, ప్రత్యేక ఉచిత దర్శన క్యూలైన్లలో బారులుతీరారు. స్వామివారి దర్శనానికి సుమారు 3 గంటలపాటు సమయం పట్టడంతో ఇబ్బందులుపడ్డారు. పునరుద్ధరణ కమిటీ చైర్మన్ పర్పాటకం దుర్గారెడ్డి, ఏఈవో బుద్ధి శ్రీనివాస్ తదితరులు ఏర్పాట్లను పర్యవేక్షించారు. చేర్యాల సీఐ శ్రీను, ఎస్ఐ నాగరాజు ఆధ్వర్యంలో బందోబస్తు పర్యవేక్షించి సిబ్బందికి సూచనలు చేశారు.



పట్నాలు వేసి మొక్కులు తీర్చుకుంటున్న భక్తులు



క్యూలైన్లలో బారులు తీరిన భక్తులు



ఎల్లమ్మతల్లికి ఒడిబియ్యం తీసుకెళ్తున్న చిన్నారి



బోనంతో శివమెత్తుతున్న భక్తుడు

వలంటీర్ల ముసుగులో వసూళ్ల పర్వం

- కొమురవెల్లి మల్లన్న సన్నిధిలో వలంటీర్ వ్యవస్థపై విమర్శలు
- ఉచిత వీఐపీ పాసుల విక్రయాలతో భక్తుల నుంచి దండుకుంటున్న వైనం
- పక్కదారి పడుతున్న సేవలు
- ఆలయాధికారుల తీరుపై అనుమానాలు
- ధార్మికసంఘాలు, ఎన్‌సీసీ కేడెట్ల సేవలు ఎంతో మేలు

చేర్యాల, ఫిబ్రవరి 18: కొమురవెల్లి మల్లన్న ఆలయంలో ప్రత్యేక సందర్భాల్లో భక్తులకు సేవలందించేందుకు ప్రవేశపెట్టిన వలంటీర్ల వ్యవస్థ పక్కదారి పడుతున్నది. అడ్డదారిన డబ్బులు సంపాదించేందుకు పలువురు మల్లన్న ఆలయాన్ని ఎంచుకుని పైరవీలు చేసి మరీ వలంటీర్లుగా చేరుతూ అవకతవకలకు పాల్పడుతున్నారు. భక్తులకు సేవలందించే ముసుగులో అందినంత దోచుకుంటూ, ఆలయ ఆదాయానికి గండికొడుతున్నారు. వరుస సంఘటనలతో ఆలయ ప్రతిష్టకు భంగం వాటిల్లుతున్నా, దేవాదాయ శాఖ అధికారులు పట్టించుకోకపోవడం పలు అనుమానాలకు తావిస్తున్నది. భక్తి, సేవా భావం కలిగిన ధార్మిక సంఘాలవారు, ఎన్‌సీసీ కేడెట్లు ఉచితంగా సేవలందించి ఆర్థిక భారం పడకుండా చేసే అవకాశం ఉన్నప్పటికీ అక్రమార్జనలో వాటాలు అందిస్తుండటంతోనే ఆలయాధికారులు వలంటీర్లను ప్రోత్సహిస్తున్నారన్న ఆరోపణలు ఎదుర్కుంటున్నారు. నచ్చిన వలంటీర్లకు ఇష్టమైన బాధ్యతలు అప్పగించడంతో పాటు ఎవరు ఎక్కడ పని చేస్తున్నారని పర్యవేక్షించకపోవడంతో దర్శనాల పేరిట ఉచిత పాసుల విక్రయిస్తూ అక్రమ వసూళ్లలో నిమగ్నమవుతుండటం వివాదాస్పదంగా మారింది. ఈమేరకు వివరాలిలా ఉన్నాయి.

ప్రత్యేక సందర్భాల్లో వలంటీర్ల సేవలు

మల్లన్న ఆలయంలో ఏటా మూడు నెలలపాటు కొనసాగే జాతర సందర్భంగా తెలంగాణ, మహారాష్ట్ర, ఏపీ, చత్తీస్‌గఢ్, కర్ణాటక, ఒరిస్సా తదితర రాష్ట్రాలనుండి సుమారు 10లక్షలమంది భక్తులు తరలివస్తారు. వారికి సేవలందించేందుకు ఆలయం తరపున ఉన్న ఉద్యోగులు, సిబ్బంది ఏమాత్రం సరిపడకపోవడంతో తాత్కాలిక పద్ధతిగా వలంటీర్లను నియమిస్తున్నారు. సాధారణ ఆదివారాలలో సుమారు20మందిని వినియోగిస్తుండగా, ఈసారి జాతర సందర్భంగా 82మందిని వలంటీర్లుగా నియమించారు. వారు ఆదివారం విధులు నిర్వహిస్తుండగా ఒక్కో వ్యక్తికి రూ.290చొప్పున వేతనంగా చెల్లిస్తున్నారు. అంతేకాకుండా ఉదయం అల్పాహారం, మధ్యాహ్నం భోజనం ఆలయం తరపున సమకూరుస్తున్నారు.

అవకతవకలను ఉపేక్షించం



వాలంటీర్ల వ్యవస్థ గతంలో నుండి కొనసాగుతూ వస్తుంది. అవకతవకలకు పాల్పడుతున్న వాలంటీర్లను ఏమాత్రం ఉపేక్షించడం లేదు. ఎన్‌సీసీ, ధార్మికసంస్థల సభ్యుల ఉచితసేవల కొనసాగింపుపై సమీక్షించి చర్యలు తీసుకుంటాం.

- బాలాజీశర్మ, ఈవో

కరువైన పర్యవేక్షణ

వలంటీర్లలో ఎవరు ఎక్కడ పని చేస్తున్నారో పర్యవేక్షించకపోవడంతో వలంటీర్ల వ్యవస్థ పక్కదారి పడుతున్నది. వయోపరిమితి పాటించాల్సి ఉన్నప్పటికీ పైరవీలతో పలువురు డిగ్రీ చదువుతున్న విద్యార్థులతో పాటు యువకులను పనిలో పెట్టుకోవడం, అవగాహనలోపంతో వారు భక్తులపట్ల దురుసుగా ప్రవర్తించడం విమర్శలకు తావిస్తున్నది.

ఏఈవోకు సహాయకులుగా ఇద్దరు!

భక్తుల సేవలను గాలికి వదిలేసి ఏఈవో గంగా శ్రీనివాస్ తన వ్యక్తిగత అవసరాలు తీర్చుకునేందుకు ఇరువురు వలంటీర్లను సహాయకులుగా ఏర్పాటు చేసుకోవడం వివాదాస్పదంగా మారింది. ఆలయ పరిసరాలలో పోగైన చెత్తను తరలించేందుకు ప్రైవేటు ట్రాక్టర్‌ను లీజు తీసుకున్నారు. కానీ సదరు ట్రాక్టర్ డ్రైవర్‌తో పాటు మరో వలంటీర్‌ను ఏఈవో తనవద్దే అంటిపెట్టుకుని అధికార దుర్వినియోగానికి పాల్పడుతున్నాడు. ఆ ఇద్దరు వ్యక్తిగత సహాయకుల్లో ఒకరు ఇటీవల ఉచిత పాసుల విక్రయ బాగోతంలో పట్టుబడి పోలీసు కేసు నమోదు కావడంతో ఏఈవో పనితీరుపై విమర్శలు వెల్లువెత్తుతున్నాయి.

ఉచిత సేవలకు అవకాశం ఉన్నా..

ఆలయంలో జరిగే ఉత్సవాలు, హుండీ లెక్కింపుల సమయంలో పలు ధార్మికసంఘాల సంస్థలతో పాటు ఎన్‌సీసీ క్యాడెట్ల నుంచి ఉచితంగా సేవలు వినియోగించుకుంటున్నారు. జాతరలో సైతం నిస్వార్థంతో భక్తులకు సేవలందించేందుకు సంసిద్ధంగా ఉన్నా, వారిని పక్కనబెట్టి వలంటీర్లను నియమించుకుంటుండటంతో ప్రతీ జాతరలో అవకతవకలు చోటుచేసుకుంటున్నాయి. గతంలో పలుమార్లు అవకతవకలకు పాల్పడుతూ పట్టుబడినప్పటికీ, ఆలయ అధికారులు ప్రస్తుత జాతరలోనూ కొనసాగిస్తూ వలంటీర్లను విస్మరించకపోవడంపై అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. లక్షలాదిరూపాయలు వెచ్చించి మరీ ఆలయానికి ప్రతిష్ఠను మసకబారుస్తున్నారు. ఈ క్రమంలో సేవాభావంతో పని చేసే ఎన్‌సీసీ, ధార్మికసంస్థల సభ్యుల సేవలు వినియోగించాలని భక్తులు కోరుతున్నారు.



ఆలయంలో కొలువైన కొమురవెల్లి మల్లన్న

వీఐపీ పాసుల దందా

భక్తుల రద్దీ ఉన్న ప్రత్యేక సందర్భాల్లోనే వలంటీర్ల సేవలు అవసరముంటాయి. అయితే సేవల మాటేమో గానీ త్వరితగతిన తాము దర్శనం కల్పిస్తామని చెబుతూ క్యూలైన్లలో వేచి ఉండే భక్తుల నుంచి వసూళ్లకు పాల్పడుతుండటం తీవ్ర విమర్శలకు తావిస్తున్నది. ఆలయాధికారుల నుంచి వలంటీర్లు అడ్డదారిన పాసులు తీసుకుని వాటి ద్వారా భక్తులకు వీఐపీ దర్శనం కల్పిస్తూ డబ్బులు దండుకుంటున్నారు. తమకు శీఘ్రదర్శనమైతే అంతే చాలని భక్తులు భావిస్తున్నారు. అందివచ్చిన ఈ అవకాశంతో వలంటీర్లు భక్తుల నుంచి డబ్బులు వసూలు చేస్తూ, పాసులు ఇచ్చిన అధికారులకు కొంత వాటా ముట్టజెప్పడంలాంటి ఘటనలు ఇటీవల కలకలం రేపాయి.



ఉచిత దర్శనం పాసులు విక్రయిస్తూ ఇటీవల పట్టుబడిన వలంటీర్లను విచారిస్తున్న దృశ్యం

కులగణన ఆమోదంపై సీఎం చిత్రపటానికి క్షీరాభిషేకం



సీఎం చిత్రపటానికి క్షీరాభిషేకం నిర్వహిస్తున్న కాంగ్రెస్ నాయకులు

మద్దూరు, ఫిబ్రవరి 18: అసెంబ్లీలో బీసీ కులగణనపై తీర్మానం చేసి ఆమోదింపజేయడంపై హర్షం వ్యక్తం చేస్తూ బీసీ సెల్ మండల అధ్యక్షుడు సుందరగిరి సత్యనారాయణ ఆధ్వర్యంలో ఆదివారం మండలకేంద్రంలో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి చిత్రపటానికి మండల నాయకులు క్షీరాభిషేకం నిర్వహించారు. ఈ సందర్భంగా మండల పార్టీ అధ్యక్షుడు బండి శ్రీనివాస్, బీసీ సెల్ మండల అధ్యక్షుడు సుందరగిరి సత్యనారాయణ మాట్లాడారు. సమగ్ర కులగణన చేపట్టేందుకు ప్రభుత్వం నిర్ణయించడం హర్షణీయమన్నారు. దీంతో బీసీలు రాజకీయంగా, సామాజికంగా ఎదగడానికి దోహదపడుతుందన్నారు. కార్యక్రమంలో ఎంపీటీసీ ఇర్రి రాజేశ్వర్‌రెడ్డి, మాజీ సర్పంచ్ కూకట్ల బాల్‌రాజ్, దాసరి పద్మారెడ్డి, జెల్ల శ్రీనివాస్, బూర్గు రాజు, గుండెగోని మల్లేశం, పుల్లూరి రాజుతో పాటు పలువురు పాల్గొన్నారు.

ఉపాధి హామీ పనులపై సామాజిక తనిఖీ



ఉపాధి హామీ పనులపై చేగుంటలో సామాజిక తనిఖీ ప్రజావేదికను నిర్వహిస్తున్న అధికారులు

చేగుంట, ఫిబ్రవరి 18: చేగుంట మండల పరిషత్ కార్యాలయ ఆవరణలో ఆదివారం అధికారులు 14వ విడత మహాత్మాగాంధీ జాతీయ ఉపాధి హామీ పథకం పనులపై సామాజిక తనిఖీ నిర్వహించారు. ఈ కార్యక్రమానికి మెదక్ జిల్లా అడిషనల్ డీఆర్డీవో రోజా హాజరయ్యారు. మండలంలోని 28 గ్రామ పంచాయతీల పరిధిలో 2022 నుంచి 2023 సంవత్సరం వరకు చేపట్టిన ఉపాధి హామీ పనులపై సమీక్ష నిర్వహించారు. ఉపాధి హామీ పనుల్లో చేసిన కూలీల పేర్లను హాజరు పట్టికలో ఉన్నట్లుగా ఆన్‌లైన్‌లో సరిగా నమోదు చేయకపోవడంతో కూలీలు నష్టపోయారని అధికారులు గుర్తించారు. ఇలాంటి పొరపాట్లు జరుగకుండా చూసుకోవాలని అడిషనల్ డీఆర్డీవో అధికారులకు సూచించారు. ఎన్ఎంఎస్‌పై అవగాహన పెంచుకోవాలని ఆమె పేర్కొన్నారు. కూలీలకు రావలసిన డబ్బులు అందించే విధంగా కృషి చేస్తామని వెల్లడించారు. కార్యక్రమంలో ఎంపీపీ మాసుల శ్రీనివాస్, జిల్లా విజిలెన్స్ అధికారి శ్రీహరి, జిల్లా క్వాలిటీ కంట్రోల్ అధికారి రమాకాంత్, ఈసీ శ్రీనివాస్, ఏపీఓ శ్వేత, ఉపాధి హామీ సిబ్బంది, వివిధ గ్రామాల ఫీల్డ్ అసిస్టెంట్లు పాల్గొన్నారు.

వృద్ధాశ్రమంలో నిత్యావసర సరుకులు పంపిణీ

బెజ్జంకి, ఫిబ్రవరి 18 : మండలంలోని తోటపల్లి గ్రామానికి చెందిన బుర్ర మహేందర్, సురేష్, హరీశ్, హరికృష్ణ, అఖిల తదితరులు తమ అమ్మమ్మ ముత్తవ్వ జ్ఞాపకార్థం గాగిల్లాపూర్ అనాథ వృద్ధాశ్రమంలోని వృద్ధులకు నిత్యావసర సరుకులు, పండ్లు పంపిణీ చేశారు. అనంతరం అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించారు. కార్యక్రమంలో వృద్ధాశ్రమ నిర్వాహకులు, వృద్ధులు పాల్గొన్నారు.

ఆధార్ సెంటర్ లేక ఇబ్బందులు

వెల్దుర్తి, ఫిబ్రవరి 18: వెల్దుర్తి మండల కేంద్రంలో ఆధార్ సెంటర్ లేక ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. ఆధార్ కార్డు నమోదు, మార్పులు, చేర్పులకు వెల్దుర్తి మండలం నుంచి తూప్రాన్, మెదక్‌లలో ఉన్న ఆధార్ కేంద్రాల వద్దకు వెళ్తున్నారు. అక్కడ జనాలు ఎక్కువగా ఉండడంతో రోజుల తరబడి కేంద్రాల చుట్టూ తిరగాల్సిన పరిస్థితి నెలకొంది. మండల ప్రజలతో పాటు చుట్టు పక్కల ఉన్న మండలాల ప్రజల ఇబ్బందులను తీర్చేందుకు వెల్దుర్తిలో అన్ని సేవలతో కూడిన ఆధార్ కేంద్రాన్ని ఏర్పాటు చేయాలని మండల ప్రజలు కోరుతున్నారు.

గోదావరి జలాల విడుదల హర్షణీయం

వెల్దుర్తి, ఫిబ్రవరి 18: కొండపోచమ్మ రిజర్వాయర్ నుంచి హల్దీ వాగులోకి గోదావరి జలాలు విడుదల చేయడం హర్షణీయమని ఆదివారం ప్రకటనలో వెల్దుర్తి జడ్పీటీసీ రమేష్‌గౌడ్, నాయకులు నర్సింహులు అన్నారు. హల్దీ వాగులోని చెక్ డ్యామ్‌లలో నీరు లేక రైతులు సాగు చేస్తున్న పంటలు ఎండిపోయే పరిస్థితి నెలకొన్నదని తెలిపారు. రైతుల ఇబ్బందులు తొలగించడానికి ప్రభుత్వం కొండపోచమ్మ సాగర్ నుంచి హల్దీ వాగులోకి గోదావరి జలాలను విడుదల చేయాలని నర్సాపూర్ ఎమ్మెల్యే సునీతారెడ్డి ఇటీవల జరిగిన అసెంబ్లీ సమావేశంలో కోరారు. ఎమ్మెల్యే కోరిక మేరకు ప్రభుత్వం హల్దీ వాగులో గోదావరి జలాలను విడుదల చేయడం అభినందనీయమన్నారు. రైతుల ఇబ్బందులను దృష్టిలో ఉంచుకోని గోదావరి జలాలు విడుదల చేసినందుకు ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డికి, నర్సాపూర్ ఎమ్మెల్యే సునీతారెడ్డికి రైతుల తరపున ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు.

దళితులపై దాడి చేసిన వారిని కఠినంగా శిక్షించాలి

నారాయణఖేడ్, ఫిబ్రవరి 18: రంగారెడ్డి జిల్లా శంకర్‌పల్లి మండలం జన్వాడలో దళితులపై దాడులకు పాల్పడ్డవారిపై హత్యాయత్నం, ఎస్సీఎస్టీ అట్రాసిటీ కేసులు నమోదు చేసి కఠినంగా శిక్షించాలని కేవీపీఎస్ జిల్లా ఉపాధ్యక్షుడు కొటారి నర్సింహులు డిమాండ్ చేశారు. ఆదివారం ఖేడ్‌లోని కేవీపీఎస్ కార్యాలయంలో నాయకులతో కలిసి దాడుల పట్ల నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రహదారి విషయంలో కొందరు మతోన్మాదులు పథకం ప్రకారం బీసీలను దళితులపై దాడికి ఉసిగొల్పారని ఆరోపించారు. నిందితులపై కఠిన చర్యలు తీసుకొని, దళితులకు రక్షణ కల్పించాలని కోరారు. ఈ కార్యక్రమంలో నాయకులు గౌతం, జైపాల్, తదితరులు పాల్గొన్నారు.

మంజీర విద్యార్థుల స్వయంపాలన

రామాయంపేట, ఫిబ్రవరి 18: రామాయంపేట మంజీర విద్యాలయంలో స్వయం పాలన దినోత్సవాన్ని శనివారం ఘనంగా జరుపుకున్నారు. ఈ మేరకు విద్యార్థులు ఉపాధ్యాయులుగా వ్యవహరించిన తోటి విద్యార్థులకు బోధన చేశారు. కార్యక్రమంలో డీఈవోగా శతమన్యు, ఎంఈవోగా కృష్ణవేణి, ప్రధానోపాధ్యాయులుగా మేఘన వ్యవహరించారని ప్రిన్సిపాల్ జితేందర్‌రెడ్డి తెలిపారు.

పెద్దమ్మ ఆలయ ప్రారంభోత్సవానికి ఏర్పాట్లు పూర్తి

- నేటి నుంచి 5 రోజులపాటు ఉత్సవాలు

రాయపోల్, ఫిబ్రవరి 18: రాయపోల్ మండలం అనాజీపూర్ గ్రామంలో ఇటీవల ముదిరాజ్ సంఘం ఆధ్వర్యంలో సుమారు రూ. 1.30 కోట్ల వ్యయంతో నిర్మించిన పెద్దమ్మ తల్లి ఆలయ ప్రారంభోత్సవ కార్యక్రమాలు ఈ నెల 19 నుంచి 5 రోజులపాటు కొనసాగనున్నాయి. సోమవారం నుంచి శుక్రవారం వరకు జరిగే ఉత్సవాల్లో భాగంగా అమ్మవారి విగ్రహ ప్రతిష్ఠ, ధ్వజస్తంభ ప్రతిష్ఠ, అమ్మవారి కల్యాణం తదితర కార్యక్రమాలు వేద పండితుల ఆధ్వర్యంలో కొనసాగనున్నాయి. ఉత్సవాల్లో భాగంగా మొదటిరోజు సోమవారం సాయంత్రం గణపతిపూజ, గ్రామ దేవతలకు పూజలు, రెండో రోజు మంగళవారం ఉదయం గణపతి పూజ, పుణ్యాహవాచనం, దీక్షాధారణ, అంకురార్పణం, ప్రధాన కలశ స్థాపన, అగ్ని ప్రతిష్ఠ తదితర కార్యక్రమాలు ఉంటాయి. బుధవారం గణపతి స్థాపన, శ్రీదేవీ, రష్మిమాల, శ్రీనవదుర్గా మహా విద్య మంత్ర మాల పారాయణాలు ఉంటాయి. గురువారం ఉదయం స్థాపిత దేవతార్చన, యంత్ర స్థాపన, ప్రాణ ప్రతిష్ఠ, మహా చండీయాగం, సాయంత్రం బోనాల ఊరేగింపు, ప్రత్యేక పూజలు నిర్వహించనున్నారు. చివరిరోజైన శుక్రవారం ఉదయం గణపతి పూజ, పెద్దమ్మతల్లికి విశేష మహాపూజ, ఉదయం పది గంటలకు పెద్ది రాజు, పెద్దమ్మల కల్యాణ మహోత్సవం నిర్వహించనున్నట్లు నిర్వాహకులు తెలిపారు.



అనాజీపూర్‌లో ముస్తాబైన పెద్దమ్మ తల్లి ఆలయం

ప్రభుత్వ ఆసుపత్రి ఎదుట ఔట్‌సోర్సింగ్ ఉద్యోగుల ధర్నా

ధర్నాకు సీఐటీయూ మద్దతు



ధర్నా చేస్తున్న ఔట్‌సోర్సింగ్ ఉద్యోగులు

సిద్దిపేట అర్బన్, ఫిబ్రవరి 18: కరోనా సమయంలో తమ ప్రాణాలను లెక్కచేయకుండా ఎంతోమంది ప్రాణాలు కాపాడిన తమను ప్రభుత్వం అన్యాయంగా విధుల నుంచి తొలగించిందని ఆరోపిస్తూ ఆదివారం సీఐటీయూ ఆధ్వర్యంలో ప్రభుత్వ ఆసుపత్రిలో పనిచేస్తున్న అవుట్ సోర్సింగ్ ఉద్యోగులు ఆస్పత్రి ఎదుట ధర్నా చేపట్టారు. ఈ సందర్భంగా సీఐటీయూ నాయకులతో కలిసి ఔట్ సోర్సింగ్ ఉద్యోగులు మాట్లాడుతూ తమకు ప్రభుత్వం నుంచి ఎలాంటి ఆదేశాలు లేకుండానే సూపరింటెండెంట్ కిషోర్ గత రాత్రి మెసేజ్ ద్వారా విధుల్లో నుంచి తొలగించడంపై ఆందోళన చేపట్టామని తెలిపారు. నర్సుల అక్రమ తొలగింపును ఆపాలని, తమకు న్యాయం చేయాలని డిమాండ్ చేశారు. తాము సుమారు 80మంది ఉన్నామని, కరోనా కష్టకాలంలోనూ విధులను నిర్వహించామని తెలిపారు. సీఐటీయూ రాష్ట్ర కార్యదర్శి గోపాలస్వామి మాట్లాడుతూ ప్రభుత్వం వెంటనే స్పందించి న్యాయం చేయాలని, తిరిగి విధుల్లోకి తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఔట్ సోర్సింగ్ ఉద్యోగులకు న్యాయం జరగకపోతే సీఐటీయూ ఆధ్వర్యంలో పోరాటానికి సిద్ధమవుతామని తెలిపారు. కార్యక్రమంలో సీఐటీయూ నాయకులు రవికుమార్, సీనియర్ స్టాఫ్‌నర్స్ తదితరులు పాల్గొన్నారు.

బీఆర్ఎస్‌పై తప్పుడు ఆరోపణలు సరికాదు



సమావేశంలో మాట్లాడుతున్న మాజీ మున్సిపల్ చైర్‌పర్సన్ సుద్దాల చంద్రయ్య


హుస్నాబాద్‌రూరల్, ఫిబ్రవరి 18: తెలంగాణాలో అధికారంలోకి వచ్చి మూడు నెలలు గడుస్తున్నా ప్రజలకు ఇచ్చిన వాగ్దానాలు అమలు చేయకుండా పరిపాలన చేతకాక కాంగ్రెస్ పార్టీ బీఆర్ఎస్ నాయకులపై తప్పుడు ఆరోపణలు చేస్తుందని హుస్నాబాద్ మున్సిపల్ మాజీ చైర్మన్ సుద్దాల చంద్రయ్య విమర్శించారు. ఆదివారం హుస్నాబాద్‌లో ఆయన విలేకరులతో మాట్లాడారు. గౌరవెల్లి ప్రాజెక్టు పనులు 98 శాతం పూర్తి చేశామని మంత్రి హరీశ్‌రావు, కేటీఆర్ అసెంబ్లీలో మంత్రి పొన్నంకు వివరిస్తే పనులు జరగలేదన్నట్లుగా హుస్నాబాద్ కాంగ్రెస్ నాయకులు మాట్లాడడం సబబుకాదన్నారు. ఎన్‌జీటి కేసు ఉన్నందున మిగతా పనులు ఆగిపోయాయని, ఇప్పుడు హుస్నాబాద్ నియోజకవర్గం నుంచి గెలిచిన పొన్నం ప్రభాకర్ మంత్రిగా కొనసాగుతున్నందున గౌరవెల్లి ప్రాజెక్టు మిగిలిన పనులు పూర్తి చేసి రైతులకు సాగునీరందించాలన్నారు. కవ్వ లక్ష్మారెడ్డి స్థానిక ఎమ్మెల్యే, మాజీ మంత్రులు హరీశ్‌రావు, కేటీఆర్‌పై అసత్యపు ఆరోపణలు చేయడం మానుకోవాలన్నారు. ఈ సమావేశంలో బిఆర్ఎస్ నాయకులు అయిలేని మల్లికార్జున్‌రెడ్డి, రమేష్ ఉన్నారు.

మహిళల ఆర్థికాభివృద్ధికి చేయూత

- పీఎంఎఫ్ఎంఈ ద్వారా రాయితీపై రుణాలు

చిన్నకోడూరు, ఫిబ్రవరి 18: ప్రస్తుత కాలంలో భార్య, భర్త ఇద్దరూ కలిసి పని చేస్తేగానీ కుటుంబం గడవని పరిస్థితి. ఈ క్రమంలో మహిళలు తమ కాళ్లపై తాము నిలబడి ఆర్థికాభివృద్ధి సాధించేందుకు కేంద్ర ప్రభుత్వం ప్రధానమంత్రి మైక్రోఫుడ్ ప్రాసెసింగ్ ఎంటర్ ప్రైజెస్ స్కీం(పీఎంఎఫ్ఎంఈ) ద్వారా రాయితీపై రుణాలను మంజూరు చేస్తున్నది. ఈ పథకం ద్వారా చిన్నతరహా పరిశ్రమలు ఏర్పాటు చేసుకుని ఉపాధి పొందే అవకాశం ఉంది.

స్కీంపై అవగాహన కల్పిస్తున్నాం



స్వయం సహాయక సంఘాల్లో ఉన్న సభ్యులు పీఎంఎఫ్ఎంఈ పథకాన్ని సద్వినియోగం చేసుకోవాలి. ఈ పథకం ద్వారా ఆసక్తి గల మహిళలు పరిశ్రమలు ఏర్పాటు చేసుకోవచ్చు. పరిశ్రమల ఏర్పాటుకు కావాల్సిన ఆర్థిక తోడ్పాటును ప్రభుత్వం బ్యాంకుల ద్వారా కల్పిస్తున్నది. ఈ పథకంపై మహిళలకు అవగాహన కల్పిస్తున్నాం.

- మహిపాల్, ఐకేపీ ఏపీఎం, చిన్నకోడూరు

మండలంలో మంజూరైన నిధులు రూ. 46 లక్షలు

చిన్నకోడూరు మండలంలో 1,240 స్వయం సహాయక సంఘాలు ఉండగా 13,014 మంది సభ్యులు ఉన్నారు. కాగా ఇప్పటి వరకు మండలంలోని ఆయా గ్రామాలకు చెందిన 23మంది లబ్ధిదారులకు వివిధ చిన్నతరహా పరిశ్రమల నిమిత్తం రూ. 46 లక్షల వరకు నిధులు మంజూరయ్యాయి.

ఒక యూనిట్‌కు గరిష్టంగా రూ. 10 లక్షల వరకు రుణం

ఆసక్తి గల మహిళలు తిను బండారాలు తయారు చేసే పరిశ్రమలు, పిండి, కారం పొడి, పసుపు గిర్నీలు, వచ్చళ్ల తయారీ పరిశ్రమలను స్థాపించుకోవచ్చు. ఇందుకోసం మహిళాసంఘాల సభ్యులు ఐకేపీ అధికారులను కలిసి దరఖాస్తు చేసుకోవాలి. సంఘంలో లేని మహిళలు మీసేవలో దరఖాస్తు చేసుకోవాలి. దరఖాస్తుదారులకు సంబంధిత బ్యాంకులు రుణాన్ని మంజూరు చేసేందుకు సుముఖంగా ఉండాలి. గతంలో తీసుకున్న రుణాలను సక్రమంగా చెల్లించి ఉండాలి. అంతే కాకుండా మంచి సిబిల్ స్కోర్ ఉన్నవారికి త్వరగా రుణం మంజూరయ్యే అవకాశం ఉంటుంది. తాము ఏ పరిశ్రమ స్థాపించాలనుకుంటున్నారో అందుకు ఎంత నగదు అవసరమో బ్యాంకు అధికారులకు చెప్పాలి. గరిష్ఠంగా రూ. 10 లక్షల వరకు రుణం తీసుకునే అవకాశం ఉంటుంది. తీసుకున్న రుణంలో 35శాతం రాయితీ ఉంటుంది. తీసుకున్న రుణాన్ని ప్రతి నెలా వాయిదా పద్ధతిలో చెల్లించాల్సి ఉంటుంది.



చిన్నకోడూరులో స్కీం ద్వారా ఏర్పాటు చేసిన పిండి గిర్నీలను పరిశీలిస్తున్న అధికారులు (ఫైల్)



హిందూవాహిని జిల్లా ప్రచార సహ సంయోజక్‌గా నియామకమైన శివారెడ్డికి కండువా కప్పి సత్కరిస్తున్న జిల్లా సంయోజక్ బసవరాజు సత్యం

హిందూవాహిని జిల్లా ప్రచార సహసంయోజక్‌గా శివారెడ్డి

చేర్యాల, ఫిబ్రవరి 18: హిందూవాహిని జిల్లా ప్రచార సహ సంయోజక్‌గా కొమురవెల్లి మండలం మర్రిముస్త్యాల గ్రామానికి చెందిన వంగ శివారెడ్డి నియామకమయ్యారు. ఈ మేరకు ఆదివారం జిల్లా సంయోజక్ బసవరాజు సత్యం నియామకపత్రాన్ని అందించారు. అనంతరం శివారెడ్డి మాట్లాడుతూ హిందూధర్మ పరిరక్షణకు పాటుపడతానన్నారు. ఛత్రపతి శివాజీ జయంతిని ఘనంగా నిర్వహించేలా కృషి చేస్తానని చెప్పారు.

బీజేపీ మండల అధ్యక్షుడిగా వెంకటరామిరెడ్డి



నూతనంగా నియామకమైన బీజేపీ మండల అధ్యక్షుడు వెంకటరామిరెడ్డిని అభినందిస్తున్న కార్యకర్తలు

నంగునూరు,ఫిబ్రవరి 18: బీజేపీ మండల అధ్యక్షుడిగా నంగునూరుకు చెందిన చౌడుచర్ల వెంకటరామిరెడ్డిని నియమిస్తూ ఆ పార్టీ జిల్లా అధ్యక్షుడు గంగాడి మోహన్‌రెడ్డి ఉత్తర్వులు అందజేశారు. ఈ సందర్భంగా వెంకటరామిరెడ్డి మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన పథకాలను గడపగడపకూ వివరిస్తూ మండలంలో పార్టీ అభివృద్ధికి తనవంతు కృషి చేస్తానని తెలిపారు. తమ నియమాకానికి సహకరించిన నాయకులకు కృతజ్ఞతలు తెలిపారు. మండల బీజేపీ నాయకులు ఆయనను అభినందిస్తూ సన్మానం చేశారు. కార్యక్రమంలో తుపాకుల నరేష్, అమీర్ శెట్టి ప్రవీణ్, జీడిపల్లి రజనీకర్‌రెడ్డి, వల్లపురెడ్డి, వేణు, సతీష్, పరమేశ్వర్, తిరుపతిరెడ్డి, లవన్‌కుమార్, జీవన్‌రెడ్డి, ప్రవీణ్ తదితరులు పాల్గొన్నారు.

కేసీఆర్‌కు హోమ ప్రసాదం అందజేత



కేసీఆర్‌కు ప్రసాదాన్ని అందజేస్తున్న ఎర్రవల్లి మాజీ సర్పంచ్ భాగ్య బాల్‌రాజు

జగదేవ్‌పూర్, ఫిబ్రవరి 18: మాజీ సీఎం కేసీఆర్ దత్తత గ్రామమైన ఎర్రవల్లిలో నిర్వహించిన అయుష్మ హోమం ప్రసాదాన్ని మాజీ సర్పంచ్ భాగ్య బాల్‌రాజు ఆదివారం వ్యవసాయ క్షేత్రంలో కేసీఆర్‌ను కలిసి అందజేశారు. కేసీఆర్ జన్మదినాన్ని పురస్కరించుకొని శనివారం ఎర్రవల్లి గ్రామంలో బాగ్యబాలరాజు ఆధ్వర్యంలో గ్రామస్థులంతా కలిసి పోచమ్మఆలయం వద్ద ఆయుష్మ హోమం నిర్వహించారు. గ్రామస్థులంతా హోమంలో పాల్గొని కేసీఆర్ ఆయురారోగ్యాలతో బాగుండాలని ప్రత్యేక పూజలు నిర్వహించారు. కేసీఆర్‌కు ప్రసాదాన్ని అందజేసిన అనంతరం ఆయనను శాలువాతో సన్మానించి జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు.

నిధులు వెనక్కి వెళ్లకుండా పనులు కొనసాగించాలి



ఖేడ్‌లో సమావేశంలో మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే భూపాల్‌రెడ్డి

నారాయణఖేడ్, ఫిబ్రవరి 18: నారాయణఖేడ్ నియోజకవర్గంలో గత ప్రభుత్వం అభివృద్ధి పనుల కోసం మంజూరు చేసిన నిధులు వెనక్కి వెళ్లకుండా ఆయా పనులను పూర్తి చేసేలా ప్రస్తుత ఎమ్మెల్యే చర్యలు తీసుకోవాలని మాజీ ఎమ్మెల్యే భూపాల్‌రెడ్డి డిమాండ్ చేశారు. ఆదివారం నారాయణఖేడ్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. బీఆర్ఎస్ ప్రభుత్వం రహదారుల మరమ్మతుల కోసం నిధులు మంజూరు చేసిందని తెలిపారు. కాంగ్రెస్ 60 ఏళ్ల పాలనలో నియోజకవర్గంలో చేపట్టని అభివృద్ధి పనులను తాము పదేళ్లలోనే చేసి చూపించామన్నారు. నారాయణఖేడ్‌ను డివిజన్ కేంద్రంగా ఏర్పాటు చేయడమే కాకుండా నాలుగు కొత్త మండలాలను, పోలీస్‌సబ్ డివిజన్ కార్యాలయాన్ని, వంద కొత్త గ్రామ పంచాయతీలను, నారాయణఖేడ్ పట్టణాన్ని మున్సిపాలిటీగా ఏర్పాటు చేయించామన్నారు. రెండు పీహెచ్‌సీలను 30 పడకల వైద్యశాలలుగా మార్చడమే కాకుండా, ఇతర అనేక అభివృద్ధి పనులను చేపట్టామని తెలిపారు. గత ప్రభుత్వంలో మంజూరైన పనులను పూర్తి చేయించాలని కోరారు. సమావేశంలో జడ్పీటీసీ లక్ష్మీబాయిరవీందర్‌నాయక్, సిర్గాపూర్ ఎంపీపీ మహిపాల్‌రెడ్డి, ఖేడ్ మున్సిపల్ మాజీ వైస్ చైర్మన్ పరశురాం, బీఆర్ఎస్ మండలాధ్యక్షుడు పరమేష్, మాజీ సర్పంచ్ జగన్‌చారి, ప్రభాకర్, సత్యపాల్‌రెడ్డి, సంగప్ప, నగేష్ తదితరులు పాల్గొన్నారు.

అనుమానంతో మహిళపై దాడికి యత్నం

- మతిస్థిమితం లేదని గుర్తించి పోలీసులకు అప్పగింత

నర్సాపూర్,ఫిబ్రవరి 18: నర్సాపూర్ మండలం పెద్దచింతకుంట సమీపంలో ప్రధానరోడ్డుపై అనుమానాస్పదంగా తిరుగుతున్న ఓ మహిళపై ఆదివారం పలువురు దాడికి యత్నించగా మాజీ సర్పంచ్ అడ్డుకుని ఆమెను పోలీసులకు అప్పగించాడు. వివరాల్లోకి వెళ్తే.. రాష్ట్ర వ్యాప్తంగా పిల్లలను ఎత్తుకెళ్లే ముఠా తిరుగుతున్నదంటూ ఇటీవల సోషల్‌మీడియాలో వైరల్ కావడం తెలిసిందే. కాగా ఆదివారం ఉదయం ప్రధాన రోడ్డుపై ఉత్తర భారతదేశానికి చెందిన ఓ మహిళ సంచారాన్ని గమనించిన పలువురు ఆమె మాట తీరును బట్టి ఆమె కూడా పిల్లలను ఎత్తుకెళ్లేందుకు వచ్చిఉంటుందని భావించారు. కొందరు ఆమెపై దాడికి యత్నించారు. అదే సమయంలో అటువైపు నుంచి వెళ్తున్న పెద్దచింతకుంట మాజీ సర్పంచ్ శివకుమార్ కల్పించుకుని మహిళపై దాడి జరగకుండా అడ్డుపడ్డాడు. ఆమె తీరు ప్రవర్తనను గమనించి మతిస్థిమితం తప్పిందని గుర్తించి పోలీసులకు అప్పగించారు.

సికింద్లాపూర్‌లో భక్తుల సందడి



శివ్వంపేట మండల పరిధిలోని సికింద్లాపూర్‌లో లక్ష్మీనృసింహ స్వామి ఆలయం వద్ద పూజలు నిర్వహిస్తున్న భక్తులు

శివ్వంపేట, ఫిబ్రవరి 18: మండల పరిధిలోని సికింద్లాపూర్‌లోని లక్ష్మీనృసింహస్వామి ఆలయ ఉత్సవాలు ఆదివారం ఘనంగా నిర్వహించారు. ఉత్సవాల సందర్భంగా ఆలయ ప్రాంగణం భక్తులతో సందడిగా మారింది. ఆలయ ప్రధాన పూజారి ధనుంజయశర్మ ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ ఆలయానికి ఉమ్మడి జిల్లాతో పాటు హైదరాబాద్, నిజామాబాద్, రంగారెడ్డి తదితర ప్రాంతాల నుంచి భక్తులు పెద్దసంఖ్యలో తరలివచ్చారు. భక్తులకు ఇబ్బందులు కలగకుండా ఆలయ అధికారులు ఏర్పాట్లు చేశారు.

ముగిసిన తిరుమల స్వామి బ్రహ్మోత్సవాలు

నిజాంపేట: మండల పరిధిలోని చల్మెడ గ్రామ శివారులో స్వయంభుగా వెలిసిన తిరుమలయ్య బ్రహ్మోత్సవాలు ఆదివారం చక్రస్నానంతో ముగిశాయని జడ్పీటీసీ పంజా విజయ్‌కుమార్ తెలిపారు. చివరిరోజు స్వామివారి విగ్రహాలకు నిత్య హోమం పూర్ణాహుతి, చక్రస్నానంతో అభిషేకం నిర్వహించారు. ఈ సందర్భంగా పెద్ద ఎత్తున భక్తులు తరలివచ్చి స్వామివారిని దర్శించుకున్నారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్ ముత్యంరెడ్డి, నరసింహారెడ్డి, ఆలయ కమిటీ చైర్మన్ అక్కపల్లి రామిరెడ్డి, రమేష్, జీపీ స్వామి తదితరులు పాల్గొన్నారు.